# లంకె-బిందెలు

## పి.జి.వుడ్‌హౌస్ ఫ్రోజెన్ ఎసెట్స్ కి

## అనుసృజన – గబ్బిట కృష్ణమోహన్



(గత సంచిక తరువాయి)

'**నిద్దర్లో నడిచెళ్ళిపోయాననో ఏదో చెప్పు.** లేకపోతే మతిమరుపు రోగం ఉందను. అయినా సంజాయిషీ చెప్పుకోవాల్సిన అవసరముందా నీకు?'

'భాస్కరాజు మండిపడతాడు.'

'అనుమానమే. బహుశా కోపంతో మంచులా బిగుసుకుపోతాడేమో కానీ మండిపడు.'

జయంతి అలవాటు కొద్దీ మళ్ళీ ముఖం నిండా సంతోషం పులుముకుని, 'జరిగిందేదో జరిగిపోయింది, మన చేతుల్లో ఏమీ లేదిప్పుడు.' అంది.

'సరే ఇంక నీ సంగేతేమిటో చెప్పు. పొద్దునపూట ఈ టైములో నువ్వు ఇంట్లోనే ఉండటం చూసి ఆశ్చర్యపోయా. ఆ రోజున బొంబాయి కానిస్టేబులు నువ్వేదో పత్రికకి ఎడిటర్‌గా పని చేస్తున్నావని సర్కిలుగారి పి.ఎ.కి చెబుతుంటే విన్నా. మరి ఎడిటింగెందుకు చెయ్యడం లేదు?'

'ఉద్యోగం నుంచి డిస్మిస్ చేశారు.'

'ఓ, అయాం సారీ.'

'నాకేం విచారంగా లేదు. అదో పనికిరాని మేగజీనులే'

'ఎవరు డిస్మిస్ చేశార్నిన్ను?'

'అనంతరామయ్య.'

'మా అన్నయ్య దత్తు చెప్పాడాయన గురించి కొంత. కృష్ణవేణికి అంకులు అవుతాడట.'

'బృహత్ ప్రచురణాలయం ప్రొప్రయిటరు. "సమాజ సుగంధాలు" మేగజీను వాళ్ళదే దానికి నేను మాజీ ఎడిటర్ని. నేను నడిపే పద్ధతి నచ్చక డిస్మిస్ చేశాడు.'

'ఎక్కడన్నా కాలు జారి నడుం విరక్కొట్టుంటే మంచిది వాడికి. ఓహ్!'

'మళ్ళీ ఏమైందిప్పుడు?'

'ఏం లేదు, భాస్కరాజుకి ఏం చెప్పాలో తట్టిందిప్పుడే మా పేపరు వాళ్ళు అర్జెంటు పని మీద నన్నిక్కడికి పంపించారని, హడావిడిలో అతనికి చెప్పి రావడానికి టైము దొరకలేదని చెబుతా.'

'బొత్తిగా పేలవంగా, పసలేనట్టు తోస్తోంది నాకైతే.'

'ఆలోచిస్తుంటే నాకూ అలానే అనిపిస్తోంది. భాస్కరాజు కూడా అలానే అనుకుంటాడు. మంచులా బిగుసుకుపోతాడు.'

'మామూలప్పుడు కూడా అలానేగా ఉండేది? బంటు చలమేశ్వరావుగారి కవిత్వంతో పరిచయమా నీకు?'

'అంతలేదు.'

'హిమాలయాల్లో ఉన్న గంగోత్రి, బద్రినాథ్‌ల గురించి పద్యాలు రాశాడాయన. అక్కడ చలి ఎంత విపరీతంగా ఉంటుందో, చల్లటిగాలి బొమికల్లోకి ఎలా చొచ్చుకుంటూ పోతుందో, కంబళ్ళు, గొంగళ్ళు కప్పుకోనివాడు నేరుగా స్వర్గానికే చేరుకుంటాడని వర్ణించాడాయన. భాస్కరాజు ఆధ్యాత్మిక గృహం హిమాలయాలే అని చాలా సార్లు అనుకుంటా ఉంటా.'

జయంతి నరేష్ కుమార్‌నే చూస్తూ కూచుంది.

'నేనో సంగతి చెబుతా వింటావా?'

'నువ్వేం చెప్పినా వింటానికి నేనెప్పుడూ రెడీ.'

'భాస్కరాజంటే నీకు ఇష్టంలేదని నా నమ్మకం.'

'అంతగా లేదనుకో, ఎస్కిమోగా పుట్టుంటే బహుశా ఇష్టపడుండేవాడినేమో.'

'ఎంబసీలో అతన్ని గురించి చాలా గొప్పగా చెప్పుకుంటారు.'

'నీకెలా తెలుసు?'

'అతనే చెప్పాడు. ఏదో ఒకరోజు అంబాసిడరు కూడా కావచ్చట.'

'అయిపోయింది, మూడో ప్రపంచ యుద్ధం తప్పదన్నమాట. అసలు నా దగ్గర భాస్కరాజు ఊసెత్తకు. పురుగు, పురుగుల్లో నీచాతి నీచమైన పురుగు.'

'ఆ పురుగుల తుట్టెలోనే నీకోరోజు రాత్రి ఆశ్రయమిచ్చాడన్న సంగతి మరుస్తున్నావ్.'

'దానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఉత్తరం రాశాను. అతనిచ్చిన ఆతిథ్యంతో నాకు న్యుమోనియా వచ్చి చాలా మంచి ఉత్తరం రాసిపడేశా.'

'ఏమైంది, స్నానానికి వేడినీళ్ళు ఉంచలేదా? '

'వేడినీళ్ళ విషయం కాదిక్కడ. ఆ మనిషి తత్వం చూసి వెన్నెముకలో చలి పుట్టుకొచ్చింది. అమ్మకానికి పెట్టిన చచ్చిన చేపంత చల్లగా ఉందతని ప్రవర్తన. అలాంటివాడిని ఇష్టపడి పెళ్ళెలా చేసుకుంటానన్నావో మిస్టరీ. ముచ్చుమొహం పెట్టుకుని ముభావంగా, గంజిపెట్టి ఆరేసిన గుడ్డలా ఏమాత్రం లొంగకుండా, ఎంబసీలో ఉన్నట్టే వ్యవహరిస్తూ నీ గుండెలు బద్దలు కొడతాడు. మీ కాపురాన్ని ఊహించుకుంటేనే భయమేస్తోంది. రిఫ్రిజిరేటర్లో సంసారం చేసే విధంగా ఉంటుందది. గడ్డకట్టే చలిలో ఎన్నో రోజులపాటు నీళ్ళల్లో నానిన శవానికుండే ఆకర్షణ, వెచ్చదనం భాస్కరాజుకు ఉన్నాయి.'

'మిస్టర్ మేడ్‌పల్, నువ్వు మాట్లాడుతోంది నేను ప్రేమిస్తున్న వ్యక్తి గురించి.'

'ఛా!'

'ఏమన్నావ్?'

'ఛా అన్నాను.'

'ఇంకోసారి అనకామాట.'

'గంజిపెట్టిన గుడ్డలా నిఠారుగా, తనే గొప్పవాడిననే అహంకారంతో గాజుకళ్ళ చూపేసుకుని, నడుస్తున్న శవంలా కనబడే ఆ మనిషిని నువ్వు ప్రేమిస్తున్నావని చెప్పినప్పుడల్లా నేనిలాగే అంటా.'

'అప్పుడు నీ కంపెనీ సరదాగా ఉంటుంది.'

'భాస్కరాజు కంపెనీకన్నా మాంఛి సరదాగా ఉంటుంది.'

'నువ్వా భాస్కరాజు సోది కట్టిపెడతావా, లేదా?'

'లేదు. ముమ్మాటికీ లేదు. గంజిపెట్టిన గుడ్డలా కరడు కట్టుకుపోయి ఎందుకూ పనికిరాని ఆ మనిషి గురించి నిర్భయంగా మాట్లాడకుండా నన్నెవ్వరూ ఆపలేరు.'

జయంతి నిట్టూర్చింది.

'ఇది మన మొట్టమొదటి కలహం మిస్టర్ మేడ్‌పల్, నువ్వో బాస్‌లా వ్యవహరిస్తున్నావ్, కాదా? నువ్వు చెప్పిందే వేదంలా నడుచుకోమంటున్నావు. చెప్పడానికి నువ్వెవరన్నట్టు జుట్టొక్కసారి విదిలించి లెక్కచేయక పోవడం నా సంస్కారం. అయినా నా విషయంలో నువ్వు అంత ఆందోళన పడటం మంచిదే అంటున్నాననుకో.'

'జయంతీ, లోకంలో నాకు కావాల్సిన మనిషల్లా నువ్వొక్కదానివే. అయితే ఎవర్నో పెళ్ళి చేసుకుంటానన్న నీ సంధి ప్రేలాపనలున్నాయ్ చూడు, అవి మాత్రం నేనొప్పుకోను. నాతోనే నీ పెళ్ళి. మనిద్దరం మేడ్ ఫర్ ఈచ్ అదర్ అని ఎంత చెబుతున్నా అర్థం కావడంలేదా? గోదావరిలో పడవ ప్రయాణం రోజులు మరిచిపోయావా? శరీరాలు వేరు కానీ మన మనసులు ఒక్కటే. నువ్వేమో భాస్కర్రాజుని పెళ్ళి చేసుకుంటానని ఊర్కే ఒకటే వాగుడు. వింటుంటే నవ్వాలో ఏడవాలో తెలీని పరిస్థితిలో ఉన్నాన్నేను. అదృష్టంకొద్దీ సమయానికి ఊడి పడ్డాను కనక గండం గడించింది. వ్యవహారం ఇప్పుడు నా చేతులో ఉంది. నిన్నటికి నిన్న దత్తు ఏమన్నాడో తెలుసా?'

'ఏదో పిచ్చిపిచ్చిగా వాగుంటాడని పందెం.'

'ఎంతమాత్రం కాదు. నాకో చక్కటి సలహా ఇచ్చాడు. అతనన్న ప్రతి అక్షరంలో మంచి విచక్షత ఉంది.'

'అలా అయితే అది మా అన్నయ్య దత్తుకాదు, ఇంకెవరో అయ్యుండాలి.'

'భాస్కర్రాజు మీద నీకున్న దరిద్రపుగొట్టు వ్యామోహానికి విరుగుడు మందు - నిన్ను గట్టిగా వాటేసుకుని ముద్దు పెట్టుకుని నీ మట్టి బుర్రలో కాస్తంత విచక్షణాజ్ఞానం వచ్చేంతవరకు వదలకుండా అలా ముద్దులు కురిపిస్తూనే ఉండమని చెప్పాడు. అంచేత ఇప్పుడే ఇక్కడే ఆ పని చెయ్యడానికి పూనుకుంటున్నా, రెడీగా ఉండు.'

'ఒక ఆడదాని మీద చెయ్యివేస్తావా నువ్వు?'

'కాస్కో, పందెం కట్టి చూడు కావాలంటే. ఒక్క చెయ్యికాదు, రెండు చేతులూ వేస్తా. నాలో నిలకడ స్వభావం, నిగ్రహం ఉన్నాయన్నావుగా, ఆ మనిషి ఎలాంటివాడో చూపిస్తా.' అన్నాడు నరేష్ కుమార్. అంతలో ఆపకుండా వరసగా డోరు బెల్లు మోగించారెవరో.

'నన్నీ బెల్లు రక్షించింది. అబలల్ని భగవంతుడే కాపాడుతాడని చెబుతూ ఉంటా నేనెప్పుడూ. ఎవరై ఉంటారో ఊహించగలవా? నా వల్ల పొరపాటుకి జరిగింది. నువ్వొచ్చి మళ్ళీ ఉద్యోగంలో చేరు అని చెప్పడానికి అనంతరామయ్య వచ్చుండాడంటావా?'

వచ్చింది అనంతరామయ్య కాదు. జయంతి వాళ్ళ అన్నయ్య దత్తు. భాస్కర్రాజు గురించి నరేష్ కుమార్ కాసేపు ముందు - రోజులపాటు నీళ్ళల్లో నానిన శవం - అంటూ చెప్పాడే దానికి చాలా దగ్గర పోలికలున్నట్టు కనబడుతున్న దత్తు అడుగు ముందుకు వేయలేక తూలుతూ లోపలికొచ్చాడు. చెల్లెలు జయంతీ, స్నేహితుడు నరేష్ అతని వాలకం చూసి ఒక్కసారే భయంతో కెవ్వున కేకేశారు. నోట్లోంచి మాటలు పెగల్లేదు.

దత్తుకి కూడా ఎక్కువ మాటలు పెగల్లేదు.

'నాకిచ్చిన తాళం చెవి ఎక్కడో పడేసుకున్నట్టున్నా. ఓ హలో, జయంతీ. అందరికీ గుడ్ నైట్ మరి,' అని చెబుతూ అక్కడున్న కుర్చీలో కూరుకుపోయి నిద్రలోకి జారుకున్నాడు.

●●●

జయంతి మూగపోయిన మొహంతో నరేష్ కుమార్ వంక చూసింది. నరేష్ కుమార్ మూగపోయిన మొహంతో జయంతి వంక చూశాడు. మానవరూపంలో ఉన్న ఈ శిధిలావశేషం – సోమర్సెట్ మామ్ కథల్లో బీచి ఒడ్డుకి కొట్టుకొచ్చిన వస్తువుల్ని ఏరుకునేవాడిలా, లేకపోతే ఈ కాలపు సినిమాల్లో హీరోలా కనిపిస్తున్న దత్తు – ఒక జీవితానికి సరిపడా తాగొచ్చాడని ఇద్దరికీ ఒక్కసారే తట్టింది. ఢిల్లీలో ఉన్నప్పుడు అతని ఉల్లాసవంతమైన పోకడలు, ఎవర్నీ లెక్కచెయ్యకుండా తిరుగుబోతులా తిరగడం వగైరాలతో బాగా పరిచయమే అయినా ఇప్పుడతనున్న స్థితి చూసి నరేష్ కుమార్ దిగ్భ్రాంతి చెందాడు. నోరు విప్పాడు కానీ హీనస్వరంతోనే మాటలు బయటి కొచ్చాయి.

‘అయ్యోరామా!‘

‘అయ్యోరామా!‘

‘ఏడేడు లోకాల దేవతలే మనల్ని రక్షించాలిప్పుడు. నాకు కనిపిస్తున్నదేమిటో నువ్వూ చూశావా?‘

‘చూశా.‘

‘తీసుకెళ్ళి గదిలో మంచం మీద పడుకోబెట్టితే నయమనుకుంటా.‘

‘అక్కడే ఉంచేయాలి.‘

‘నువ్వు చక్కగా అన్నగారికి జోలపాడుతూ, కథలు వినిపిస్తూ బజ్జోపెట్టే ప్రయత్నం చేస్తుండు, ఆలోపల నే వెళ్ళి ఓ డజను నిమ్మకాయలు కొనుక్కొస్తా. నిమ్మరసం ఎంత తాగించినా పైపైనే సోకుతుండొచ్చు కానీ కాస్తో కూస్తో మేలు చేస్తుంది.‘

జయంతి భుజాలు కుదించి దించింది.

‘తేవాలనిపిస్తే వెళ్ళి తీసుకురా, అయినా మావాడికి దాంతో పని లేదు. ఇలాంటి అఘాయిత్యాలు ఎన్ని చేసినా లేచిన తరువాత ఏమీ జరగనట్టే ఉంటాడు, అది చూస్తేనే నాకు పిచ్చెక్కుతుంది. మేలుకోగానే తాజాగా విచ్చుకున్న పువ్వులా కూనిరాగం తీస్తు మళ్ళీ ఎంత రెచ్చిపోవాలా అని ప్లానేస్తు ంటాడు. మావాడి శరీరంలో ఉన్న గ్రంధులే అలాంటివనుకుంటా.‘

నరేష్ కుమార్ ఆశ్చర్యపోయాడు. ఢిల్లీలో కలిసున్నప్పుడు తాగొచ్చిన మర్నాటి ఉదయం దత్తు ఎలా ఉంటాడో అనుభవం లేదతనికి.

కుర్చీలో పడున్న అవశేషాన్ని మరోసారి చూసి ఆశ్చర్యంతో. ‘విచ్చుకున్న పువ్వులా తాజాగానా?‘ నమ్మలేనట్టు అడిగాడు. ‘నువ్వనేదేమిటి, హేంగోవరంటూ ఏమీ ఉండదా? పశ్చాత్తాపం అనేది ఎరగడా? నెత్తిమీద ఐసు ముక్కలు అక్కర్లేదా? పొరబాటయిందని ఒప్పుకోవడమంటూ ఉండదా? జీవితంలో మళ్ళీ దాని జోలికెళ్ళనని ఒట్లు పెట్టడా?‘

‘ఏకోశానా ఉండదు. అందుకే నా గుండె పగిలిపోయేది. చేసిన దానికి సరిపడా మావాడు కనక బాధ అనుభవిస్తే ఓర్చుకోగలను. నేను మొత్తుకునేదల్లా వాడికేమీ అవదే అని. ప్రపంచంలో న్యాయమనేది ఎక్కడా లేదని పిస్తోంది. అయినా, భూతదయ చూపిస్తూ సంచి పుచ్చుకుని బజారెళ్ళొస్తానంటే వెళ్ళిరా.‘

నరేష్ కుమార్ తిరిగొచ్చేసరికి దత్తు మాయమయ్యాడు. బహుశా బెడ్రూంలోకెళ్ళి పడుకునుంటాడు. ఆ కుర్చీలో ఇప్పుడు జయంతి కూచునుంది. ప్రపంచంలో బాధలన్నీ తనే మోస్తున్నట్టు ఉంది. ఆమెనలా చూసి అతని గుండె తరుక్కుపోయింది.

‘కాస్త నిభాయించుకో జయంతీ,‘ అన్నాడు సున్నితంగా సముదాయిస్తూ. ‘నీకెంత బాధగా ఉందో అర్థం చేసుకోగలను, కానీ నువ్వలా దిగజారిపోకూడదు. షాకయినట్టున్నావు. కాదనను. స్వంత అన్నయ్య ఇలా కల్లు పాకలో కుండలకొద్దీ తాగొచ్చినట్టు చేస్తే ఏ చెల్లెలూ భరించలేదు. అంతెందుకు నా మట్టుకు నేను చెల్లెల్నయి ఉంటే నేనూ భరించలేకపోదును. అయినా ప్రమాదం జరగలేదు కనక బతికిపోయాం. ఎలాగో అలా స్వంత గూటికే చేరు కున్నాడు కానీ పోలీస్ స్టేషనుకి కాదుగా. అంతా సవ్యంగానే ఉన్నట్టుంది నాకైతే.‘

పక్కన కూచుని అనునయంగా ఓదార్చుతూ చెప్పిన మాటలు జయంతిని ఏమాత్రం సముదాయించలేక పోయాయి. అంతా సవ్యంగా, సజావుగా ఉందన్న నరేష్ కుమార్‌తో ఏకీభవించడం లేనట్టున్నాయి ఆమె చూపులు. ఆశావాదికీ నిరాశావాదికీ మధ్య ఉండే తేడాలు తెలుసుకోవాలంటే వాళ్ళిద్దరి వైఖర్లు చూస్తే చాలు తెలుస్తుంది.

'నువ్వలా భావిస్తున్నందుకు సంతోషం,' అంది జయంతి. 'నేనూ నీలా ఉండగలిగితే బావుండును. దత్తు మళ్ళీ విజృంభించి తిరిగితే గతేమిటి? అదృష్టం ఎన్నిసార్లని కాపాడుతూ వస్తుందయ్యా?'

'అందుకే మళ్ళీ తిరిగకుండా కట్టుదిట్టం చెయ్యాలి.'

'అతన్నెలా ఆపగలవో చెప్పు? నువ్వన్నట్టు గూడులోనే బంధించి బయటికి పారిపోకుండా ఉంచే ఉపాయం ఏదన్నా తట్టితే ఎంతబావుణ్ణు.'

'ఉందొక ఉపాయం. అతను తొడుక్కునే ప్యాంట్లు పోగుచేసి దాచిపారేస్తా.'

'ఏమిటీ!'

'ఇలాంటి చిన్న చిట్కాలే గొప్పగా పనిచేస్తాయి. అతని ప్యాంట్లన్నీ కాజేస్తా, రోగం కుదుర్తుంది దాంతో.'

మౌనంగా కాసేపు ఊర్కుండిపోయి, 'ఈ ఆలోచన బాగానే ఉంది కానీ, కాసేపెలాగో గడిపి నీ ప్యాంట్లు కాజేస్తాడేమో?' అడిగింది జయంతి.

'నేనిక్కడ ఉండనే ఉండను. బట్టలు సర్దుకుని గాజువాకులో మా అంకులింటికి మకాం మారుస్తా. నా రాక ఆయనకి ఇష్టముండదు, నాకూ అంతేననుకో, అయినా సర్దుకుపోవాలి. ఆయన్ని ఒకట్రెండు రోజులు భరించగలను, ఆయనా నన్ను భరించక తప్పదు. కావాల్సిందల్లా దృఢసంకల్పమే. నా ప్రకారం మనం ఇలా చేయొచ్చు - నేనిక్కడ్నించి వెళ్ళిపోతా, నువ్వు ఇక్కడికొచ్చెయ్యి. దత్తు తొడుక్కునే ప్యాంట్లు గాజువాకకి తీసుకెడతా. ఆలోగా హోటలుకెళ్ళి సామాన్లు సర్దుకునుండు, అక్కడకొచ్చి నిన్ను శ్రీ లక్ష్మిలో లంచికి తీసుకుపోతా,' మరీ ఖరీదుకాని ఆ చిన్న హోటలు పేరు చెప్పాడు నరేష్ కుమార్. 'ఆ, అన్నట్టు భోజనం చేస్తూ ఇప్పటిదాకా మాట్లాడిన విషయం గురించి ఇంకా నీకు చాలా చాలా చెప్పాలి. సందేహాలేమన్నా ఉన్నాయా?'

'లేవు. నువ్వన్నీ కవర్ చేసినట్టే ఉంది.'

'నాకూ అలానే అనిపిస్తోంది.'

'మరి మా అన్నయ్య ప్యాంట్లు ఎన్నున్నాయో తెలుసా?'

'రెండే రెండు జతలు. సినిమా హీరో ఏం కాడతను. బొంబాయినుంచి కట్టుగడ్డల్తో పారిపోయొచ్చిన మూలాన విశాఖపట్నం రాగానే చిన్న చవకబారు రెడీమేడ్ షాపులో మరో జత కొన్నట్టు చెప్పాడు. కనక సరుకు మొత్తం పోగుచేయడానికి అట్టే కష్టపడక్కర్లేదు. ఆ పని నువ్వే చెయ్యడం మంచిదనిపిస్తోంది. చప్పుడు చెయ్యకుండా నువ్వు నాకన్నా సుతిమెత్తగా అడుగులు వెయ్యగలవు. దత్తుని నిద్రలేపకుండా బెడ్రూములోకి దూరగలవా?'

'మావాడు కొన్ని గంటల్దాకా పిడుగులు పడ్డా మేలుకోడు.'

'మరైతే పని మొదలెడితే మంచిదికదా. ఏమిటి, నన్నే చూస్తూ కూచున్నావలా?'

'ఎప్పుడూ ఇలా గొప్పగా తెలివి చూపిస్తావా అని ఆలోచిస్తూ నిన్ను చూపుల్తో తాగేస్తున్నా.'

'చాలావరకు నేనెప్పుడయినా ఇంతే, ఏమనుకున్నావో.'

'దాంతోపాటు నువ్వెందుకిలా ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నావూ అని కూడా ఆలోచిస్తున్నా.'

'ఓహో, కాస్తంత చిరునవ్వుని చూశావన్నమాటేనా నువ్వు? ఏం లేదు, నీ భాస్కర్రాజు గుర్తుకొచ్చాడు. వాళ్ళ అమ్మగారితో లంచ్ చేసేందుకు తీసుకెడదామని ఇంటికొస్తే తీరా నువ్వు ఇంట్లో లేకపోవడం చూసి ఎంత మధన పడతాడా అని ఆలోచించా, అంతే. అతని కనుబొమ్మలు పైకి లేస్తే ఆశ్చర్యపడక్కర్లేదనుకుంటా.'

●●●

భాస్కర్రాజు కనుబొమ్మలు పైకి లేవడమన్నది ముందురోజు సాయంత్రమే జరిగిపోయింది. వాళ్ళమ్మగారు తాజ్ మహల్ హోటలు కొద్దు, ఒబెరాయ్‌కి వెడదామని చెప్పింది, ఆ మార్పు జయంతికి తెలపాలని ఆఫీసుకి ఫోన్ చేస్తే ఆమె అప్పటికే విశాఖపట్నం వెళ్ళిందని చెప్పారు.

ఆ సంగతి వింటూనే అతని కనుబొమ్మలు చాలా పైకి లేచాయి. తన అనుమానాలన్నీ నిజమయ్యాయని గుర్తించి ఎంబిసిలో చిన్నా చితకా మాట్లాడే పరుషమైన పదాలు దాదాపు నోటికొచ్చాయి. బొంబాయొదిలి జయంతి విశాఖపట్నం వెళ్ళాల్సిన కారణం ఒకటే ఒకటనుకున్నాడు ఆ మనిషున్నాడే, జయంతి ప్రేమికుడు - నరేష్ కుమార్ - వాడిని రహస్యంగా కలవడానికి వెళ్ళుంటుంది. ఆ రోజు రాత్రి ఇద్దరూ చెట్టాపట్టాలేసుకుని తన అపార్ట్‌మెంటుకి రావడం గుర్తుచేసుకున్నాడు. ఇంకో రోజు చాలా అర్జెంటుగా జయంతికోసం ఫోన్ చేసిన సంగతి కూడా గుర్తుకొచ్చింది. ఇవన్నీ కాక తన తల్లిని కలిసేందుకు లంచ్‌కి తీసుకుపోవడానికొస్తే ఇంట్లో కూచుని వాడు జయంతితో ముచ్చట్లాడుతూ ఉండటం  కూడా గుర్తుచేసుకున్నాడు.

పరిస్థితులు భరింపశక్యం కాకుండా తయారైనాయి కనక, కఠిన చర్యలు తీసుకోవడం తప్పదనుకున్నాడు. వెంటనే జయంతిని ముఖాముఖి కడిగేసి తేల్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. క్లుప్తంగా చెప్పాలంటే జయంతిని దబాయించాలి.

అలా అనుకుని వెంటనే ఆఫీసుకి ఫోన్ చేసి నరాల బలహీనతతో బాధపడుతున్నందుకు రెండు రోజుల పాటు ఆఫీసుకు రాలేనని చెప్పి సెలవు పెట్టాడు. మర్నాడు పొద్దున్నే చక్కగా బ్రెడ్డూ, ఇంపోర్టెడ్ జాముతో బ్రేక్ ఫాస్ట్ ముగించి ఎయిర్ పోర్ట్ కెళ్ళి మొట్టమొదట దొరికిన విమానం ఎక్కాడు విశాఖపట్నానికి.

●●●

అలవాటు ప్రకారం అనంతరామయ్య మర్నాడు పొద్దున పదిగంటలకల్ల ఆఫీసుకొచ్చి బల్లముందు కూచుని మామూలుగా పని చేసుకుందామనుకున్నాడు కానీ ఏ మాత్రం ఏకాగ్రత చూపించలేకపోయాడు. మిస్.మీనాక్షిని పిలిచి రెండు మూడు లెటర్లు డిక్టేట్ చేసి పంపించి, వంటరిగా ఊర్కే టేబులు మీద దరువులేస్తూ కూచున్నాడు. ముందు రోజు రాత్రి దత్తుకేమయిందో తెలుసుకోవాలన్న ఆతుతతో పుల్లారావునుంచి ఫోనెప్పుడొస్తుందా అని ఎదురుచూశాడు.

ఒక జీవితకాలం ముగిసినట్టయిన తరువాత టెలిఫోన్ మోగింది.

'అనంతరామయ్యా?'

'డాక్టర్ అనంత్ స్పీకింగ్ హియర్,' అన్నాడు అనంతరామయ్య, మొదటి ఒత్తి పలుకుతూ, పుల్లారావు చాకచక్యాన్ని, తెగింపుని ఎంత మెచ్చుకున్నా అదేమిటో ఈ మధ్య తన దగ్గిర చనువెక్కువ తీసుకుంటున్నాడు. అది నచ్చడం లేదు. తన కింద పనిచేసిన మాజీ ఎడిటరు ఏమోయ్ అంటూ పిలిచే రోజులు కూడా త్వరలో రావచ్చనుకున్నాడు. 'యస్, పుల్లారావ్, యస్? నాకేమన్నా గుడ్ న్యూస్ వినిపిస్తున్నావా?'

పుల్లారావుకి చావు కబురు చల్లగా చెప్పడం రాదు. ఓపిగ్గా చెబుతూ శ్రమ పడటం ఎందుకనే తత్వం అతనిది. 'పొరపాటేదో జరిగింది, ఎందుకిలా అయిందో అర్థం కావటంలేదు. చెన్నకేశవులు ఇప్పుడు మా ఆఫీసులోనే ఉన్నాడు. అతని ప్రకారం నిన్నరాత్రి దత్తు పీకలదాకా తాగివెళ్ళాడట. ఇంతకుముందే ఇంటికి ఫోన్ చేస్తే తనే ఫోను తీశాడు. అంటే, ఎలాంటి ఉపద్రవం జరక్కుండా ఇంటికి

చేరుకున్నాడని అర్థం తెల్లవార్లు తాగిన మనిషి దార్లో పోలీసులకి చిక్కుతాడని ఎంతయినా పందెం కాసుండేవాడిని,' ఇరవై వేల రూపాయలు బ్యాంకులో జమ కావడం లేదన్న బాధతో విచారంగా చెప్పాడు పుల్లారావు. కోట్లాది రూపాయలు పోగొట్టుకున్నవాడికి వచ్చేంత దిగులొచ్చిందతనికి.

ఆ రెండో వర్గానికి చెందినవాడైన అనంతరామయ్యకి ఒళ్ళు జలదరించినట్టయింది. 'సరే మరి, అదండీ జరిగిన కథ,' అంటూ పుల్లారావు టెలిఫోను పెట్టేసిన చాలాసేపటికి కొంచెం తేరుకుని దాదాపు చల్లబడినా బుర్రకి మాత్రం ప్రశాంతత చిక్కలేదు. మనసంతా దిగులుతో నిండిపోయింది. అగాధంలో చిక్కుకున్న మగవాళ్ళు ఆడదాని సాంగత్యంలో సముదాయింపు కోసం వెంపర్లాడతారు. మిస్.మీనాక్షితో చనువు బాగా ఏర్పడిన తరువాతనే లంచ్‌కో, డిన్నరుకో పిలవాలనుకున్నాడు ఇప్పటిదాకా, అయితే తను అత్యవసర పరిస్థితిలో ఉన్నట్టు గ్రహించి కుర్చీలోంచి లేచి తలుపు తెరిచాడు.

'ఆ, మిస్ మీనాక్షి.'

'యస్, డాక్టర్ అనంత్?'

'అసలూ.. అదే నాకేం తట్టిందంటే నాతోబాటు హోటల్లో లంచి చెయ్యడానికి నీకు వీలవుతుందా?'

ఆ ప్రశ్నకి మిస్.మీనాక్షి అందమైన ముఖం వెలిగిపోగానే అనంతరామయ్య పొంగిపోయాడు కానీ మరో నిమిషంలో చల్లబడాల్సి వచ్చింది.

'యస్సార్, నాకైతే రావాలని సరదాగా ఉంది కానీ బొంబాయి ప్రొడ్యూసరు రమేష్ కపూర్ గారిని మీరివాళ లంచికి పిలిచిన సంగతి మరిచిపోయినట్టున్నారు.'

ఎదుటి మనిషి ఆడదైనందుకు తమాయించుకున్నాడు, లేకపోతే నోట్లోంచి బండబూతులు రాలుండేవి. ఈ లంచ్ అప్పాయింట్ మెంట్ పూర్తిగా బుర్రలోంచి తుడుచుకుపోయింది.

'ఈరోజు మాత్రమే తనకి వీలుపడుతుందని, రేపు బ్యాంకాక్ వెడుతున్నాననీ చెప్పారాయన. మధ్యాహ్నం ఒకటిన్నరకల్లా వచ్చి మిమ్మల్ని కలుస్తానన్నారు.'

ఆ రోజు ఎండ విపరీతంగా ఉన్నా అనంతరామయ్య ఒణుకుతున్నాడు. రమేష్ కపూరంతటి పెద్ద ప్రొడ్యూసరొచ్చి తీరా ఆతిథ్యమిస్తానన్న పెద్దమనిషి చెప్పాపెట్టకుండా మాయమైనాడని తెలుసుకుంటే జరిగే ఉపద్రవం ఊహించుకోగానే చలిజ్వరం వచ్చినట్టయిందతనికి. దినపత్రిక, వారపత్రిక, మాసపత్రిక, సినిమా మేగజీన్లు వగైరా నడిపే అధిపతి కోట్లాది రూపాయల ప్రకటనలిచ్చే ప్రొడ్యూసరుకి కోపం తెప్పించి బతకలేడు. పైగా ఈ రమేష్ కపూర్ గాడికి ముక్కుమీదే కోపం ఉంటుందని కూడా తెలుసు.

'థాంక్యూ వెరీమచ్, మిస్.మీనాక్షీ,' అన్నాడు కృతజ్ఞతతో. 'గుర్తు చేసినందుకు చాలా థాంక్స్. మరో మారెప్పుడన్నా వెడదాం, సరేనా?'

'ఓ యస్, తప్పకుండా సార్.'

'అన్నట్టు అడగటం మరిచిపోయా, ఒంట్లో ఎలా ఉందివాళ? తలనొప్పి వచ్చిందన్నావు నిన్న, తగ్గిందా?'

'ఓ, తగ్గిపోయింది సార్.'

'సరే, మీ చిన్నరాయుడెలా ఉన్నాడు?'

'ఎవరుసార్?' అంటూ తెల్లమొహమేసుకుని అడిగి, కాసేపాలోచించి, 'మీరడిగింది 'నాగూ గురించాండీ?'

'నాగూ?'

'నేను దానికి 'నాగూ' అని పేరు పెట్టాను. ముందున్న పేరు చాలా పొడుగ్గా ఉంది. మా మామయ్యకి నాగేశ్వరావంటే వల్లమాలిన అభిమానం, నేనేమో నాగార్జున అన్నా, నాగచైతన్య అన్నా పడిచస్తా. అంచేత ఆ పేరు పెట్టాన్సార్.'

'అఫ్‌కోర్స్. యస్ బాగుంది. ముచ్చటగా ఉందాపేరు.'

అనంతరామయ్య మళ్ళీ ఆఫీసులోకెళ్ళి కూచుని మధ్యాహ్నం తన ప్రేయసితో కాక - కలిసినప్పుడల్లా బోరు కొట్టించే సినిమా ప్రొడ్యూసరుతో లంచి తప్పనిసరి కావడం కొంత విచారకరంగా ఉన్నా, కుంగిపోక, జోరు మీదున్నాడు. మిస్.మీనాక్షిని పిలిపించడానికి చేస్తున్న ప్రయత్నాలు చక్కగా సాఫీగా సాగుతున్నాయనుకున్నాడు. ఆ పిల్లని మంచి చేసుకోడానికి ముందేమో పూలు, తరువాత చాక్లెట్ బాక్సులు, ఆ తరువాత మంచి ఆల్సేషియన్ కుక్కనీ బహుమానంగా ఇచ్చాడు. దానిపేరు నాగు అని పెట్టకుండా ఉంటే బాగుండేదనుకున్నాడు. ఇప్పుడేమో లంచికి ఆహ్వానించాడు. నాదానివి కమ్మని అడగడం మినహా ఒక మగవాడు చేయవలసిందంతా చేసి కూచున్నాడు.

ఇలా రకరకాలుగా ఆలోచిస్తూ ఆ ప్రొడ్యూసరు బాత్రూములో జారిపడ్డందుకు నడ్డి విరిగిందనీ లంచికి రాలేననీ ఫోనొస్తే బాగుండని ఎదురుచూస్తూ కూచుంటే కాసేపటికి నిజంగానే ఫోన్ మోగింది.

అయితే ఫోన్ చేసింది రమేష్ కపూర్ కాదు - అతని నడ్డి విరగలేదు సరికదా ఎప్పుడూ లేనంత దృఢంగా ఉంది. ప్రస్తుతం బాత్రూములో కూనిరాగాలతో స్నానం చేస్తూ అనంతరామయ్య ఇచ్చే లంచికి తయారవుతున్నాడు. ఫోనొచ్చింది పుల్లారావునుంచి, మంచి హుషారుగా ఉందతని గొంతు.

'అనంతరామయ్యా?'

'డాక్టర్ అనంత్ స్పీకింగ్ హియర్.'

'అనంతరామయ్యా, ఇప్పటిదాకా నేను చేసిందేమిటో తెలుసా, చెన్నకేశవుల్తో బాతాఖానీ కొట్టడం ఇప్పుడే వెళ్ళాడిక్కడినుంచి.'

అనంతరామయ్య పట్టించుకోకుండా, 'ఒహో?' అని మాత్రం అన్నాడు. చెన్నకేశవులనే ముసుగుమనిషి మూలాన తనకి ఒరిగేదేమీలేదు. వాడిప్పుడు ఉన్నాడా, వెళ్ళాడా, చచ్చాడా అన్నది అనవసరం.

'పోతూ పోతూ ఏమని చెప్పెళ్ళాడో తెలుసా? ఢిల్లీలో ఉన్న జర్నలిస్టు ఫ్రెండుతో మాటల్లో మాటగా మీ అన్న దిగంబరయ్యగారి ప్రస్తావన వచ్చినప్పుడు ఆయనొట్టి పిచ్చాడని చెప్పాడట. అలాంటివాడు వీలునామా రాసే స్థితిలో ఉండలేడని విభేదిస్తూ కోర్టుకెక్కాలనుకున్నారా మీరెప్పుడన్నా?'

'వీలునామా విషయం బయటపడగానే సహజంగా ముందు అదే తట్టింది. మా లాయర్ని సంప్రదిస్తే వద్దంటూ వారించాడు. నా దగ్గిర సాక్ష్యాలు, ఋజువులు లేవన్నాడు.'

'చెన్నకేశవులి ఫ్రెండు చెప్పింది వింటే మీకు కావలసినన్ని సాక్ష్యాలు, ఋజువులు దొరుకుతాయి.'

ఇప్పటిదాకా అనంతరామయ్య గొంతులో ఉత్సాహం ఏమాత్రం కనపడలేదు. పుల్లారావు టెలీఫోన్ చేసినప్పుడల్లా కంపరం పుట్టినట్టవుతుంది. పైగా తనో గొప్ప ప్రతిభావంతుడినన్నట్టు అతి చనువు ప్రదర్శిస్తాడు. వాడిని ఒకటి రెండు మెట్లు దించాలనుకున్నాడు. అయితే ఇప్పుడతను చెప్పింది వినగానే పరుషమైన ఆ కార్యక్రమాన్ని వెనక్కి పెట్టి, ఈ కుర్రాడు చాలా గొప్పవాడు, ఎంత పొగిడినా తక్కువేననుకున్నాడు. ఇంత మంచి ప్రైవేట్ డిటెక్టివ్‌ని అనవసరంగా అపార్థం చేసుకున్నందుకు పశ్చాత్తాపం చెందాడు.

'యస్, పుల్లారావ్? యస్? చెప్పు పుల్లారావ్.'

'అనంతరామయ్యా, ఏమడుగుతున్నారు? గట్టిగా చెప్పండి. మాటలు మింగేయద్దు.'

'చెన్నకేశవులికి వాళ్ళ ఫ్రెండు ఏం చెప్పాడుట?'

'ఆ ఫ్రెండు పేరు జగన్నాథం.'

'పేరు సంగతి వదిలెయ్.'

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments